నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# ఆదిలాబాద్

శుక్రవారం 7 జూలై 2023
FRIDAY, JULY 7, 2023 | ADILABAD | పేజీలు PAGES : 12


## తాగు నీటి గోస తీరింది..

లక్షెట్టిపేట రూరల్, జూలై 6 : అప్పట్లో తాగునీటికి మస్తు గోస పడ్డం. మా ఊరిలోని ఫిల్టర్ బెడ్ వద్దకు నడుసుకుంట పోయి తెచ్చుకునేటోళ్లం. ఇగ ఇంటి అవసరాలకైతే మరీ తిప్పలయ్యేది. మస్తు లొల్లి అయితుండె. ఇగ ఎండకాలమైతే మా బాధలు చెప్పనక్కర్లేదు. తెలంగాణ వచ్చి కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక అన్ని బాధలు పోతున్నయ్. ముఖ్యంగా తాగు నీళ్లకు తిప్పల లేకుండా చేసిండు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లిస్తున్నడు. కాలు కదపకుండా ఇంటి వద్దనే నీళ్లు పట్టుకుంటున్నం. ఇంటి అవసరాలకు కూడా గీ నీళ్లనే వాడుకుంటున్నం. సీఎం కేసీఆర్‌కు మా మహిళలంతా రుణపడి ఉంటరు.

**- మేడి చిలుకమ్మ, లక్షెట్టిపేట**

**కాళేశ్వరం టూ ఎల్లంపల్లికి..**

ఇన్‌ఫ్లో 10,440 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో 6,635 క్యూసెక్కులు



● నాడు దుర్భరం.. నేడు అద్భుతం..



పంపుల ద్వారా ఎల్లంపల్లిలోకి వస్తున్న నీరు

# కదిలొచ్చిన.. కాళేశ్వర గంగ..

.. మధ్యపేజీలో

## ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పరవళ్లు తొక్కుతున్న జలప్రవాహం

- ప్రస్తుతం 12 టీఎంసీలు.. తాగునీటి అవసరాలకు 0.09 టీఎంసీలు..
- మంచిర్యాల జిల్లాలోని తొమ్మిది మండలాల్లో గల 350 ఆవాసాలకు ఆధారం
- వ్యవసాయ అవసరాలకు వాడుకున్నా ఐదు నెలలు నీటికి ఢోకా లేదు..
- సాగునీటికి కూడా ఇబ్బంది లేదంటున్న నీటి పారుదలశాఖ అధికారులు
- నెరవేరిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి కేసీఆర్ స్వప్నం

**అపర భగీరథుడు, సీఎం కేసీఆర్** సంకల్పబలంతో నిర్మితమైన ప్రపంచంలోనే అతిపెద్దదైన ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టు. తెలంగాణ జీవధారగా పిలుచుకునే కాళేశ్వర గంగ జలాలు కదిలొచ్చి మంచిర్యాల జిల్లా భూభాగాన్ని ముద్దాడాయి. కరువును తరిమేయడానికి.. సాగు, తాగునీటిని అందించడానికి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్నాయి. గతేడాది ఇదే సమయానికి 8 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 12 టీఎంసీల నీటినిల్వ ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కరువొచ్చినా.. మంచిర్యాల జిల్లావాసులకు తాగు, సాగు నీటికి ఢోకా ఉండదని మిషన్ భగీరథ అధికారులు భరోసా ఇస్తున్నారు. ప్రస్తుతం బరాజ్ పెద్దపల్లి జిల్లా ధర్మారం వరకు నిండుకుండను తలపిస్తుండగా.. 145 అడుగుల వరకు నీరు నిల్వ ఉంది. మంచిర్యాల జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలో సుమారు 350 ఆవాసాలకు నీటిని సరఫరా చేస్తుండగా.. వర్షాలు పడకున్నా కాళేశ్వరం ఉన్నన్ని రోజులు నీరు దొరుకుతోంది. కాగా.. జిల్లాలో 18 మండలాలు ఉండగా.. 17 మండలాలకు భగీరథ నీరు అందుతోంది. ప్రధానంగా ఐదు మండలాలతోపాటు నాలుగు బల్దియాలకు ఎల్లంపల్లి నీరే ఆధారం. ఈ నేపథ్యంలో నాటి దుర్భర.. నేటి అద్భుత పరిస్థితులపై 'నమస్తే' ప్రత్యేక కథనం..

- మంచిర్యాల, జూలై 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**నాడు పిల్ల కాలువ..**

కాళేశ్వరం పరిధిలోని ప్రాజెక్టుల నిర్మాణానికి ముందు మంచిర్యాల జిల్లా పక్కనున్న గోదావరి చిన్న పాయలా పారేది. అవతల ఉన్న ఎల్లంపల్లి నుంచి గుడిపేట, నమ్నూర్ గ్రామాల మధ్య పిల్ల కాలువను తలపించేది. ఈ చుట్టు పక్క ప్రాంతాల వారు సాగు, తాగు నీటికి తల్లడిల్లేవారు. తలాపున గోదావరి పారుతున్నా.. ఆ నీటిని వాడుకోలేకపోతున్నామని బాధపడేవారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు

**నేడు మహా సంద్రం..**

2004లో సమైక్య పాలకులు ఎల్లంపల్లి ప్రాజెక్టు పనులు ప్రారంభించి వదిలేశారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎల్లంపల్లికి మంచిరోజులు వచ్చాయి. సీఎం కేసీఆర్ రూ.5,400 కోట్లు వెచ్చించి 2016లో పూర్తి చేయించారు. గతంలో పిల్ల కాలువను తలపించిన ఎల్లంపల్లి ప్రాంతం.. ఇప్పుడు గోదావరి మహా నది స్వరూపాన్ని కండ్లకు కడుతున్నది. మంచిర్యాల మొదలుకొని ధర్మపురి వరకు నిండుకుండను తలపిస్తున్నది.



పట్టాలు అందుకున్న గిరిజన మహిళలతో మంత్రి ఐకేరెడ్డి

.. 8లో

## కేసీఆర్‌తోనే రైతులకు భరోసా

- త్రీఫేజ్ కరెంటుతోపాటు గిరివికాస్ కింద బోర్లు వేయిస్తాం
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి
- మామడ మండలంలో పోడు రైతులకు పట్టాల పంపిణీ

సీఎం కేసీఆర్ అధికారంలో ఉంటేనే రైతులకు భరోసా ఉంటుందని, పోడు పట్టాల పంపిణీతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని రాష్ట్ర అటవీ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నిర్మల్ జిల్లా మామడ మండలంలో 3,061 ఎకరాల భూమిని 1,152 మంది గిరిజనులకు కలెక్టర్ వరుణ్‌రెడ్డితోకలిసి అటవీ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. అలాగే.. ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలో ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, ఖానాపూర్, దస్తురాబాద్‌లో ఎమ్మెల్యే రేఖానాయక్ పాల్గొని గిరిజనులకు పోడు పట్టాలు అందించారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

..2లో

## పంట పరిహారం రూ.5.8 కోట్లు

- నిధులు విడుదల చేసిన సర్కారు
- మార్చి, ఏప్రిల్ నెలల్లో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులు
- ఉమ్మడి జిల్లాలో 5,082 ఎకరాలకు 4,480 మందికి వర్తింపు